# (శృంగవృక్షంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 8-3-97)

బ్రహ్మం గురించి తెలియజేసేదే నిజమైన విద్య. అది బ్రహ్మవిద్య. మిగిలినవి అన్నీ అవిద్యలు. అవి చావులేని స్థితికి నిన్ను తీసుకొని వెళ్ళలేవు. ఈ లోకం ఎంతనిజమో నీ దేహం ఎంతనిజమో ఆవిద్యలు కూడా అంతే నిజం. బంధం అనేది ఉంటే దానిలో నుండి విడుదల పొందటం ఎలాగ అని ప్రశ్నిస్తున్నారు. నీవు జ్ఞానమును సంపాదించాలి అనే ప్రయత్నంలో ఉన్నావు. అందులో భాగంగా తెలుసుకోవాలి అనే కాంక్షతో ఈ ప్రశ్న అడుగుతున్నావు. బంధంలో నుండి ఎవరో బయటకు తీసుకుని వస్తారు అని ఎదురుచూడకు. బంధంనుండి బయటకు రావాలి అనే తపన నీకు రావాలి. నీ అంతట నీవు హృదయపూర్వకంగ ప్రయత్నం చేయాలి. శ్రవణం చేయటం వలన బంధంనుండి బయటకు రావాలి అనే కాంక్ష కలుగుతుంది. శ్రద్ధగా శ్రవణం చేసి ఆ మాటల యొక్క అర్థాన్ని మననం చేస్తే నీకు వివేకం కలుగుతుంది. వివేకం వలన నీవు అజ్ఞానం నుండి, బంధం నుండి బయటపడటానికి అవకాశం వుంది. నీ ప్రయత్నమే, నీ తపనే ఈశ్వరానుగ్రహంగా మారిపోతుంది. నిరంతరము పరమేశ్వరునితో మానసికఅనుబంధం పెట్టుకో. అప్పుడు మనస్సు పక్వానికి వస్తుంది. దేవుని నామమును నిరంతరము స్మరించటం వలన కూడ మనస్సు సంస్కరింపబడుతుంది. నీవు ప్రయత్నం చేయాలి. ఏమీ చేయకుండా మోక్షం కోసం ఎదురు చూడకండి. నీనెత్తిమీద బరువు ఉంటే ఎవరైనాదింపగలరు. నీకు ఆకలిగా ఉంటే నీవే అన్నంతినాలి. నీకు దాహంగా ఉంటే నీవే నీరు త్రాగాలి అలాగే నీకు బంధం ఉంది కాబట్టి దానిని పోగొట్టుకొనే ప్రయత్నం నీవే చేయాలి. జరిగిపోయిన గొడవలను నిరంతరం తలపెట్టుకోవద్దు. దానివలన వర్తమానకాలం పాడయిపోతుంది. ఇప్పుడైనా ప్రయత్నం చెయ్యి.ఎటువంటి పరిస్థితులలో నీవు వున్నాకూడా ప్రయత్నం చెయ్యి. నీ కుటుంబ పరిస్థితులు నీకు అనుకూలంగా వున్నా, ప్రతికూలంగా వున్నా నిర్మలంగా వుండు. మహాత్ములను చూడటం వలన, వారి మాటలను వినటం వలన మారుమనస్సు వస్తుంది. మారుమనస్సు ఎప్పుడైతే వచ్చిందో మనం సంస్కరింపబడతాము. జ్ఞానం సంపాదించాలి అనే కాంక్ష నీకు కలిగినందుకు సంతోషం. దీని వలన నీవు బాగుపడతావు, నీ కుటుంబ సభ్యులు బాగుపడతారు అంటున్నారు.

నీ మనస్సును మచ్చిక చేసుకో. ఒక ప్రక్కన చైతన్యం ఉంది. ఒక ప్రక్కన జడం ఉంది. మధ్యలో మనస్సు వుంది. ఈ మనస్సును జడం వైపుకు త్రిప్పావో బంధంలో పడతావు, జననమరణ ప్రవాహంలో పడతావు. అటు చైతన్యం వైపుకు త్రిప్పావో నీవు చావులేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతావు. విషయాలను చింతిస్తూవుంటే జడం వైపుకు వెళతావు. ఆత్మను చింతిస్తూ ఉంటే జ్ఞానం వైపుకు వెళతావు. ఎటువెళ్ళాలో నీవే నిర్ణయించుకో. కోరికలు నెరవేరుతుంటే అహంభావన పెరుగుతూ ఉంటుంది. కోరికలు అన్నీ నెరవేరిన తరువాత మోక్షం పొందటానికి ప్రయత్నం చేద్దాము అనుకొంటూ ఉంటారు. సముద్రం ఒడ్డున కూర్చుని కెరటాలు తగ్గిన తరువాత స్నానం చేద్దాము అనుకోవటం ఎటువంటిదో నీ కోరికలు అన్నీ తీరిన తరువాత మోక్షం కోసం ప్రయత్నం చేద్దాము అనుకోవటం అటువంటిదే. సముద్రము దగ్గరకు స్నానానికి వెళ్లినపుడు కెరటానికి కెరటానికి మధ్య స్నానం చేసి వచ్చేస్తాము. అలాగే కుటుంబంలో ఏదో కష్టాలు వస్తూఉంటాయి. ఆ కష్టాల మధ్యన సాధన చేసి మోక్షం పొందటానికి ప్రయత్నం చేయాలి.

సాధన విషయంలో శ్రద్ధగా వుండాలి. బహుజాగ్రత్తగా వుండాలి. మనం కుటుంబ విషయాలలో జాగ్రత్తగా వుంటాము గాని సాధన విషయంలో జాగ్రత్తగా ఉండము. చిల్లర గొడవలలో జాగ్రత్తగా ఉండటం కాదు. జ్ఞాన సముపార్జన విషయంలో జాగ్రత్తగా ఉండు. బంధంలో నుండి బయటపడాలి అనే కాంక్ష నీకు ఉంటే నీకు సత్పురుషులు సహాయం చేస్తారు. శరీరానికి రోగం వస్తే డాక్టరు దగ్గరకు వెళ్ళి మందులు తెచ్చుకొని

వేసుకొంటున్నావు. పత్యాలు చేస్తున్నావు. అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నావు. అజ్ఞానం నుండి బంధం నుండి బయటకువావటానికి నీవు చేసే ప్రయత్నం ఏమిటి? నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవం లోనికి వచ్చినపుడు కదా నీకు సుఖం, శాంతి తెలిసేది. ఎవరికో అనుభవం వచ్చినందువలన నీకు ఏమి కలిసి వస్తుంది. ఆ వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినపుడు నీకు శాంతి తెలుస్తుంది. దానికోసం నీవు ప్రయత్నం చెయ్యి. నీవు ప్రయత్నం చేస్తూ వుంటే జ్ఞాని సహకారం అందిస్తాడు.

కొంత మందికి ఎంతసేపు చర్మదృష్టేగాని, అంతర్దృష్టి ఉండదు. మనస్సు బాహ్యాముఖానికి విజృంభించకుండా లోపలకు కొంచం కొంచం జరుగుతూ ఉండాలి. చైతన్యం ఎక్కడ వుందో అక్కడకు జరుగుతూ ఉండాలి. అంతర్ దృష్టి కలగాలి. నీవు పూర్వజన్మలలో ఎంతో పుణ్యం చేసి ఉంటేగాని నీకు అంతర్ దృష్టి కలుగదు. ఏదైనా పని చేసి అది అందరకు తెలిసిపోవాలి అనుకోవటం వలన నీకు కోటి జన్మలు ఎత్తినా అంతర్ దృష్టి రాదు. నీకు అంతర్ దృష్టి లేకపోతే జ్ఞానం కలుగదు. మీరు అనేక జన్మలలో చేసిన పుణ్యం వలన మీకు అంతర్ దృష్టి కలుగుతుంది. నువు ఏదో పని చేస్తావు . దాని వలన ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని అనుభవిస్తావు. మరల ఆ పని చేసి ఫలితాన్ని అనుభవించు. అని నీ మనస్సు చెపుతుంది. అంటే ఆ పనినే రిపీట్ చేయమని చెపుతుంది. అప్పుడు ఆ పని చుట్టూ, ఫలితం చుట్టూ నీ మనస్సు తిరుగుతుంది గాని కనీసం హృదయంలోనికి వెళ్ళి దేవుని తెలుసుకోవాలి అనే కాంక్ష కూడా ఉదయించనివ్వదు. పనిచేస్తూ ఉంటావు. ఫలితాన్ని అనుభవిస్తూ ఉంటావు. ఈలోపు ఏదో రోజు శరీరం జారిపోతుంది. ఫలితం అశాశ్వతమే కాదు. నీవు మోక్షం పొందకుండా అడ్డు వస్తుంది. నువ్వు అనుభవిస్తున్న కర్మఫలం నిన్ను అంతర్ముఖం అవ్వనివ్వదు. నీ మనస్సును బాహ్యాముఖం చేస్తుంది. నీ బలహీనతలను ఎవరో వచ్చి తొలగించరు. వాటిని నీవే ప్రయత్నం చేసి తొలగించుకోవాలి. ప్రయత్నం ఇప్పుడే మొదలు పెట్టు. ప్రయత్నం చేసేటప్పుడు ఒకవేళ శరీరం మరణించినా నీ ప్రయత్నం నీ కూడానే వస్తుంది.

శరీరం మరణించిన తరువాత బంధువులు గాని, స్నేహితులు గాని ఎవరూ నీకూడా రారు. గురువు ఒక్కడే నీ కూడా వస్తాడు. మీరు రావద్దు అన్నా నీ కూడా వస్తాడు. ఎందుకంటే ఆయన అనుగ్రహ స్వరూపుడు. ప్రతీజన్మకు మీ కూడా వచ్చి మీలో ఉన్న బలహీనతలను ఎలా తొలగించాలి అని చూస్తాడు. చావులేని స్థితిని పొందటానికి ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో చూసి ఒకో దానిని తొలగించి, లోపల వస్తువును తెలుసుకోవటానికి నీ చైతన్య స్థాయిని పెంచి, మీకు జ్ఞానం కలిగే వరకూ మీరు రావద్దు అన్నా ప్రతీజన్మకూ మీ కూడా సిద్దమవుతాడు వాడు గురువు. బంధాలు ఉంటే ఉండనివ్వండి. వచ్చే జన్మలో పోతాయి అనుకోవద్దు. అవి పోవు మీకూడా వస్తాయి. మీరు ప్రయత్నం చేసి వాటిని పోగొట్టుకోవాలి. మీరు ప్రయత్నం చేస్తే గురువు అనుగ్రహం వస్తుంది. లోపల అర్హతను, యోగ్యతను పెంచుకోవాలి. మనస్సును సంస్కరించుకోవాలి. నీలోపల ఉన్న వస్తువు సమానంగా ఉంది. అలాగ నీ మనస్సును సమానం చేసుకొంటూ రావాలి. జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, పూజ చెయ్యి. వీటి వలన నీలోపల యోగ్యత పెరగాలి. వీటివలన నీ లోపల యోగ్యత పెరగక పోతే ఇవి చేసినందువల్ల జ్ఞానం రాదు. లోకం మనం చేసే పనిని చూస్తుంది. దేవుడు నీవు చేసే పనిని చూడడు. నీవు ఏ ఉద్ధేశ్యంతో చేస్తున్నావో, ఎందుకు చేస్తున్నావు అని పరమేశ్వరుడు చూస్తాడు. దానిని బట్టి నీకు మార్కులు ఇస్తాడు. ప్రతీ చిన్న విషయమును దేవుడు లోపల ఉండి చూస్తూ ఉంటాడు. ప్రకృతికి సంబంధించిన గుహలలో కూర్చొన్నంత మాత్రం చేత నీకు జ్ఞానం కలుగదు. ప్రకృతికి సంబంధం లేని గుహ ఒకటి ఉంది. అది హృదయగుహ. అందులో పడిపోతే జ్ఞానం కలుగుతుంది. నీవు కాని విషయాలతో తాదాప్యం వదిలి వేస్తే నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది.